క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం చేసుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

7న బైక్ ర్యాలీ


మాట్లాడుతున్న పులికొండన్న

నంద్యాల(అర్బన్): మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఈనెల 7న నంద్యాల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న తెలిపారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన ముఖ్యనేతలతో మాట్లాడుతూ ఐక్యతే సమాజానికి దిక్సూచి అని చాటిని వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమన్నారు. వాల్మీకి జయంతి వేడుకలను జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, గోపాల్, జయరాం, మధుగోపాల్, శివ, శీను తదితరులు పాల్గొన్నారు.

కరస్పాండెంట్లకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు


అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న కరస్పాండెంట్లు

నంద్యాల(న్యూటౌన్): పట్టణానికి చెందిన ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేసినట్లు సమతా విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బాలచంద్రుడు ఆదివారం తెలిపారు. విజయవాడలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రవి కిండర్ గార్డెన్ పాఠశాల చైర్మన్ పడకండ్ల సుబ్రమణ్యం, కరుణామయ పాఠశాల కరస్పాండెంట్ దస్తగిరికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు రావడం అభినందనీయమన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం


చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రంలో ఆదివారం రాష్ట్రీయ సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నగర సంఘ్ తారక్ మహేశ్వరరెడ్డి, భారతీయ జనతాపార్టీ, నగర అధ్యక్షుడు రమేష్ బాబు పర్యవేక్షణలో స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని కేశవరెడ్డి స్కూల్‌లో ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా భరతమాత గురూజీల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, సేవల్లో సంఘ్ సేవలు అజరామరమన్నారు. కార్యక్రమంలో చింతలపల్లె వాసు, నాగదీపు, మునీశ్వర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బుక్కాపురంలో క్షుద్రపూజల కలకలం


ముగ్గు వేసి పూజలు చేసిన దృశ్యం

మహానంది: మండలంలోని బుక్కాపురం శ్మశానం వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లు ఆదివారం కలకలం రేపాయి. గుర్తు తెలియని కొందరు వ్యక్తులు శ్మశానంలో ముగ్గు వేసి, పసుపు, కుంకుమ, వివిధ రకాల ద్రవ్యాలతో కొందరు పూజలు చేయడాన్ని గ్రామస్తులు చూశారు. వారు ఊర్లోకి వెళ్లి స్థానికులు సమాచారమివ్వగా.. కొందరు అక్కడికి చేరుకునే లోపు పరారయ్యారని గ్రామస్తులు తెలిపారు. స్థానికులు 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వగా ఇద్దరు కానిస్టేబుళ్లు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దారంతా గుంతలే!

- నరకాన్ని చూపిస్తున్న గుండుపాపల -ఉమాపతినగరం రోడ్డు
- బాగు చేయాలని ప్రయాణికుల వేడుకోలు


గుంతలమయంగా గుండుపాపల-ఉమాపతినగరం రహదారి

దొర్నిపాడు: 'బ్రదర్.. ఈ దారి ఉమాపతినగరం వెళ్తుందా అని అంతరాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి స్థానికుడిని అడిగాడు. వెళ్తుంది కానీ చాలా జాగ్రత్తగా వెళ్లాలి. దారంతా గుంతలు పడి అందులో నీళ్లు చేరి చెరువులను తలపిస్తున్నాయి' అని బదులిచ్చాడు. ఎన్నికల ముందు గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో రహదారుల దుస్థితికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి రోడ్లు మండలంలో చాలా ఉన్నాయి. అయితే, మండలంలోని గుండుపాపల-ఉమాపతి నగరం రహదారి మరీ దారుణంగా ఉంది. అడుగడుగునా గుంతలతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఉమాపతినగరంలో పక్షవాత నివారణ కేంద్రం ఉండటంతో అంతరాష్ట్రాల నుంచి రోగులు నిత్యం వచ్చిపోతుంటారు. దీంతో రోగులు ప్రయాణంలో అగచాట్లు పడుతున్నారు. అలాగే ఆ రహదారిని ఆర్‌అండ్‌బీలోకి కలపాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకుంటున్నారు. ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతలు నిండిపోవడంతో కొత్తగా వచ్చే ప్రయాణికులు ఎంత లోతు ఉన్నాయో అని భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళల్లో చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. జిల్లాకు చెందిన ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించి రహదారిని ఆర్‌అండ్‌బీలోకి కలిపి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతల్లో వర్షం నీరు నిలిచిన దృశ్యం

ఆశలు ఆవిరి

- కుందూనదిలో కొనసాగుతున్న నీటి ఉధృతి
- పంట పొలాలను ముంచెత్తిన వరద
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతులు మొర


సర్వాయిపల్లె గ్రామ సమీపంలో వరద నీటి ప్రభావంతో కుళ్లిపోయిన పత్తి, మినుము పంటలు

ఉయ్యాలవాడ : కుందూనది వరదల కారణంగా నదీ తీరం వెంట ఉన్న రైతులకు కన్నీళ్లు మిగిలాయి. వరద నీరు పంట పొలాలను ముంచెత్తడంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. దీంతో దిక్కుతోచక అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. ఒక్కో ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేల వరకు ఖర్చు చేసి పంటలు సాగు చేశామని వాపోతున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద నీరు పోటెత్తడంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి గత నెల రోజులుగా విడతలు విడతలుగా కుందూనదికి భారీ ఎత్తున అధికారులు నీటిని విడుదల చేశారు. దీనికి తోడు వర్షం నీరు తోడవ్వడంతో పంట పొలాల్లో నీరు చేరి పైర్లు కుళ్లిపోయాయి. మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అరకొర కురిసిన వర్షాలకు రైతులు 1,846 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. వరి 795 హెక్టార్లు, మొక్కజొన్న 528, కంది 176, పత్తి 98, మినుము 81, మిరప 77, సోయాబీన్ 15, జొన్న 33 హెక్టార్లలో వేశారు. వ్యవసాయాధికారులు ప్రాథమికంగా 168 హెక్టార్లలో మండల పరిధిలో వరద నీటి ప్రభావంతో పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఇందులో వరి 93 హెక్టార్లు, కంది 27, మొక్కజొన్న 43, పత్తి కేవలం 5 హెక్టార్లలో మాత్రమే నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అన్ని గ్రామాల్లో పరిశీలన చేస్తే ఎక్కువ శాతం పంటలు వరద నీటికి గురైన విషయం తెలుస్తుంది. ప్రస్తుతం వరద నీటి ప్రభావం ఉధృతి తగ్గింది. కుళ్లిపోయిన పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలు జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న విజయవాడలోని హనుమాన్ పేటలో ఉన్న దాసరి భవన్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మధ్యాహ్న భోజన పథకం పేరు మారుతుందే తప్ప కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో కార్మికులకు అతి తక్కువ వేతనం లభిస్తుందన్నారు. సెంట్రలైజ్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతుందనీ, దీన్ని వ్యతిరేకిస్తున్నటు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే రూ.10 వేలు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు రమణమ్మ, సంధ్యా, సులోచనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రోటరీ క్లబ్ భవనంలో మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ రాయలసీమ జోన్ చైర్మన్ విజయ్‌కుమార్‌యాదవ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు వివేకానందరెడ్డిని ఘనంగా సన్మానించినట్లు రోటరీ క్లబ్ కార్యదర్శి కామినేని బాలకృష్ణ, శ్రీరామ్మూర్తి, చిన్నపురెడ్డి తెలిపారు. ఇటీవల ఎన్నికైన వీరిని రోటరీ క్లబ్ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, కైలాసనాథరెడ్డి, సుబ్బరామ, హరినాథ్, రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.


రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానిస్తున్న దృశ్యం

రోటరీ ఇంగ్లిష్ మీడియ స్కూల్‌లో..

పట్టణంలోని రోటరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ సుబ్బయ్య, క్లబ్ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సమాజ నిర్మాణ శిల్పులన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులు వినోద్‌కుమార్, బాలరాజు, శేషశయనారెడ్డి, సుబ్రమణ్యం, పుల్లయ్య, మురళీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేశవమూర్తి, కార్యదర్శి వెంకటేశ్వరరావు, చింతలమోహన్‌రావు, ప్రసాద్, మహబూబ్‌బాషా, అన్నెం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నంద్యాల(న్యూటౌన్): రాష్ట వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 400 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. విద్యావ్యవస్థ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా లేదన్నారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యాసంస్థలు అవస్థలకు గురవుతున్నాయన్నారు. దీనిపై సర్కారు స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్‌నాయక్, రాజా, జిల్లా నాయకులు దినేష్, ఆయేషా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

గురుతేజం పురస్కారం అందజేత

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఉదయ ఫౌండేషన్, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్, తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల వాసి కొప్పుల ప్రసాద్‌ను సన్మానించి గురుతేజం పురస్కారం అందజేశారు. చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఈ కార్యక్రమం జరిగినట్లు నంద్యాలకు చెందిన న్యూక్లియస్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రెడ్డి, అన్నెం శ్రీనివాసరెడ్డి, వాసుదేవరెడ్డి, కళారాధన కార్యదర్శి రవికృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచిన వారిని, రచయితలను సన్మానించినట్లు తెలిపారు. అలాగే కడప పట్టణంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభలో బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయులు శేషఫణిని పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి సన్మానించారు. ఈ విషయాన్ని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి షరీఫ్, ముత్తోజీ వీరబ్రహ్మం ఆదివారం తెలిపారు.


ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

దివ్యమాత దర్శనం.. సకల పాపహరణం


ఉత్సవాలకు ముస్తాబైన చౌడేశ్వరి దేవాలయం


గర్భగుడిలో కొలువైన అమ్మవారు

- నేడు ఓర్వకల్లులో చౌడేశ్వరిదేవి తిరుణాల

ఓర్వకల్లు: తొగట వీరక్షత్రియుల ఆరాధ్య దైవం, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావించే చౌడేశ్వరిమాత తిరుణాల మహోత్సవం సోమవారం ఉదయం ఓర్వకల్లు గ్రామంలో ప్రారంభం కానుంది. కొలిచే వారికి కొంగు బంగారంలా భావించే అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి సౌఖ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

విశిష్ట పూజలు: తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల అనంతరం ఐదు రోజుల పాటు ఉదయం, సాయంత్రం విశిష్ట పూజ లు, లలిత సహస్రనామార్చనలు నిర్వహించనున్నారు. పౌర్ణమికి ముందు రోజు అమ్మవారికి అభిషేకాలు, సహస్ర నామార్చనతో పాటు ఆలయాన్ని అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తారు. రాత్రి ఆకుపూజ, హరికథలు, ఉపన్యాసాలు, భజనలు నిర్వహించనున్నారు. భజన కళాకారులచే చెక్కభజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు పూర్వాచారాల ప్రకారం జ్యోతుల మహోత్సవం వైభవంగా జరుగనుంది.డప్పుకళాకారుల నృత్యాలు, నందికోల సేవ, ఖడ్గశావల ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారికి భక్తులు 26 జ్యోతులను సమర్పించా రని ఆలయ పూజారి రామకృష్ణ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖ ల అధికారులు హాజరు కావాలని సూచించారు.

ప్రయాణికుడిపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్‌లో బసు ఎక్కేందుకు నిలబడిన ప్రయాణికుడిపై ఆర్టీసీ దూసుకెళ్లిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 05జడ్0157 నంబరు గల బస్సు కర్నూలు నుంచి ఆత్మకూరు వెళ్తుండగా పటేల్ సెంటర్‌లో ప్రమాదం జరిగింది.బస్సెక్కడానికి రోడ్డుపై నిలిచిన జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి బొల్లవరం శేషన్న కాళ్లపైకి ముందు చక్రం ఎక్కినట్లు ప్రయాణికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవురోజు కావడంతో ఆదివారం మహానంది ఆలయం భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం రాతి నంది, పెద్ద నంది ప్రాంతాలను తిలకించి గరుడనందీశ్వర ఆలయాన్ని సందర్శించారు.

అలరించిన సంప్రదాయ నృత్యం



సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నాట్యపురి డాన్స్ అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమములో మహా గణపతిం, శివపంచాక్షరి, దేవీస్తుతి, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు, స్తోత్రాలకు సమితా మిశ్ర, జ్యోతిక, ప్రత్యూష, శ్రీదేవి, ఐశ్వర్య తదితరులు నృత్యం చేశారు .

మార్కుల జాబితా తీసుకెళ్లండి

జూపాడుబంగ్లా: 2024-25 పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాఠశాల ల్లోంచి మార్కుల జాబితాను తీసుకెళ్లవచ్చని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలలు న్నాయన్నారు. గతేడాది పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒర్జినల్ మార్కుల జాబితాలు ఆయా పాఠశాలలకు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సంప్రదించి తీసుకెళ్లవచ్చునని తెలిపారు. మార్కుల జాబితాను విద్యార్థులకు ఇచ్చే సమయంలో వారి నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయవద్దని హెచ్‌ఎంలకు సూచించారు. ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి ఫిర్యాదులొస్తే విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చౌడేశ్వరి ఆలయానికి విరాళం

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి కోసం ఇదే గ్రామానికి చెందిన కీ.శే. మొదుళ్ల రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనవరాలు గోమైదిలిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.25,516 విరాళం ఇచ్చారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అర్చకులకు విరాళం అందజేశారు. దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.


విరాళం అందజేస్తున్న దాతలు

ఫెన్సింగ్ క్రీడాకారిణికి సత్కారం

నంద్యాల(న్యూటౌన్): ఫెన్సింగ్ క్రీడాకారిణి పబ్బతి చిన్మయి శ్రేయకు ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేసినట్లు అధ్యక్షుడు సముద్రాల జనార్దన్, ఆర్యవైశ్య నాయకులు పబ్బతి వేణుగోపాల్ తెలిపారు. అలాగే వెనుకబడిన మహిళలకు, వికలాంగులకు ఆర్థిక సహా యం అందించారు. అనంతరం క్రీడాకారిణి చిన్మ యి శ్రేయ మాట్లాడుతూ తల్లితండ్రి, గురువుల నుంచి శిక్షణ తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారిణిగా ప్రతిభ చాటానన్నారు. ఫెన్సింగ్ క్రీడల్లోనే కాకుండా కూచిపూడి, భక్తి, భగవద్గీత పఠనం, తదితర సాంస్కృతిక రంగాల్లో రాణించాలని అన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చిన్మయి శ్రేయకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

మురుగు పారదు.. సమస్య తీరదు


అల్లూరులో ప్రధాన రహదారిపై నిలిచిపోయిన మురుగు నీరు


కల్వర్టు వద్ద నిలిచిపోయిన మురుగు

ఉయ్యాలవాడ: మండలంలోని అల్లూరు గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్వర్టు వద్ద మురుగు నీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని వృథా నీరు, వర్షపు నీరు కలిసి రహదారిపై రెండు అడుగుల లోతుగా నిల్వ ఉండడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల బెడదతో వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు.

వైభవంగా మా ఊరి విందు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మెయిన్ బజార్‌లోని అమ్మవారి శాలలో మా ఊరివిందు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అమ్మవారి పీఠాలతో పాటు వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ వసంతోత్సవ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మహిళలు పసుపు నీళ్లు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం అమ్మవారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు చీరతో అలంకరించి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు భవనాశి వాసు, కార్యదర్శి శేష మాట్లాడుతూ దసరా పండుగ తర్వాత వచ్చే ఆదివారం రోజున ఈ కార్యక్రమం ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ వాసవీ మాత


మా ఊరి విందు కార్యక్రమంలో పాల్గొన్న ఆర్య వైశ్యులు

క్షణికావేశానికిలోనై జీవితాలు నాశనం చేసుకోవద్దు

జూపాడుబంగ్లా: క్షణికావేశంతో ఘర్షణలు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున సూచించారు. ఆదివారం ఉదయం మండలంలోని తూడిచెర్ల గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ, ఎస్ఐ అధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో బహిరంగ సభ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తగాదాల జోలికి వెళ్లకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించటం అలవర్చుకోవాలన్నారు. సమస్యలు నెలకొన్నప్పుడు ఆవేశానికి లోనై ఘర్షణలకు పాల్పడకుండా సత్వరమే పోలీసులను ఆశ్రయించి, సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈడిగ సరస్వతమ్మ, ఇంట్లో సోదాలు చేయగా అక్రమంగా బెల్టుషాపు నిర్వహించి విక్రయిస్తున్న 31 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెతో పాటు భర్త చంద్రశేఖర్‌గౌడుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఎలాంటి కాగితాల్లేని 16 బైక్‌లకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ మల్లికార్జున

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగండి



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు, మాట్లాడుతున్న సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రైట్.రెవ. సంతోష్ ప్రసన్నరావు

నందికొట్కూరు: ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రైట్. రెవ. కామనూరి సంతోష్ ప్రసన్నరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చిని బిషప్ సందర్శించారు. సీఎస్ఐ టౌన్ చర్చి ఫంక్షన్ హాల్ నూతన గదిని ప్రారంభించారు. సంఘస్తులు నూతన బిషప్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. వారిని ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గంలోనే నడవాలన్నారు. సమాజం క్రైస్తవులను ఆదర్శంగా తీసుకునే విధంగా జీవనం కొనసాగించాలని సూచించారు. సీఎస్ఐ నూతన చర్చి నిర్మాణానికి సంపూర్ణంగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ సంఘం కమిటీ సభ్యులు, క్రైస్తవులు, స్త్రీల మైత్రీ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.